
ప్రజాశక్తి

ఆదివారం 21 డిసెంబర్ 2025

5

పార్వతీపురం మన్యం



## సుశాసన్ సప్తాః లో భాగస్వాములు కండి

**పార్వతీపురం** : ఈ నెల 19 నుంచి 25 వరకు జరగుతున్న సుశాసన్ సప్తాః కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం సంబంధిత అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారత ప్రభుత్వ పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం, సుపరిపాలన వారంలో భాగంగా వారం రోజుల పాటు ఈ ప్రచారాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రకటించిందన్నారు. జిల్లాలో ప్రచారానికి సంబంధించిన అన్ని కార్యకలాపాల సమన్వయం, పర్యవేక్షణకు మన్యం జిల్లా కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్‌ను నోడల్ అధికారిగా నియమించినట్లు చెప్పారు. నోడల్ అధికారి సుపరిపాలన వారంపై పురోగతి రికార్డులను నిర్వహించాలని, నివేదికలు, మీడియా కంటెంట్‌ను సకాలంలో సమర్పించేలా చూసుకోవాలని ఆదేశించారు. రచనలను పోర్టల్ (https://darpgapps.nic.in/GGW%25) లో 'సుపరిపాలన ఉత్తమ పద్ధతులు' విభాగం కింద అప్‌లోడ్ చేయాలని అన్నారు.

# టోల్ ఫీజుకు డబ్బుల్లేక బస్సు నిలిపివేత

- మానాపురం టోల్ గేట్ వద్ద గంట నిలిచిన బస్సు
- తీవ్ర అసౌకర్యానికి గురైన ప్రయాణికులు

**ప్రజాశక్తి - పార్వతీపురం/దత్తిరాజేరు**

రాష్ట్రం లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు తర్వాత ఆర్టీసీ దుస్థితి దయనీయంగా తయారైందనడానికి ఇదొక చక్కని ఉదాహరణ. శనివారం పార్వతీపురం డిపోకు చెందిన ఎపి 03 జడ్ 5004 అనే పల్లె వెలుగు బస్సును ఎక్స్ ప్రెస్ సర్వీస్‌గా మార్చి అధికారులు విజయనగరం పంపించారు. పార్వతీపురం- విజయనగరం మధ్యలో మానాపురం వద్ద టోల్ గేట్ వుంది. ఈ గేట్ అన్ని వాహనాలు టోల్ ఫీజు చెల్లించాల్సి ఉంది. అయితే పార్వతీపురం డిపోకు చెందిన పల్లె వెలుగు ఎపి 03జడ్ 5004 బస్సు ప్రయాణికుల తో వెళ్లా టోల్ గేట్ వద్ద ఆగింది. టోల్ ఫీజు చెల్లించడానికి డబ్బులు లేక డ్రైవర్ గంట పాటు అక్కడే బస్సు నిలిపివేశారు. సాధారణంగా ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర వాహనాలు కూడా ఆన్ లైన్‌లోనే టోల్ ఫీజు ఫాస్ట్ ట్యాగ్ ద్వారా ఖాతా నుంచి వసూలు చేస్తుంటారు. అయితే సంస్థ ఖాతాలో డబ్బులు లేవనో, ప్రయాణికుల నుంచి ఛార్జీల రూపంలో డబ్బులు రాకనో డ్రైవర్ బస్సును రోడ్డు పక్కన నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. సమయానికి పరీక్ష హాజరు కావాలని కొంతమంది విద్యార్థులు కూడా ఇదే బస్సులో ప్రయాణిస్తున్నారు. ఎక్స్‌ప్రెస్ కదా కొంతమంది ప్రయాణికులు ఈ బస్సులో ఎక్కారు. పండుగల సీజన్ ప్రారంభం కావడంతో ఆర్టీసీ పల్లె వెలుగు బస్సునూ ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లుగా మార్చి యాజమాన్యం నడుపుతోంది. అయితే టోల్‌ఫీజు చెల్లించడానికి కూడా ఆర్టీసీ వద్ద డబ్బు



టోల్‌గేటు వద్ద నిలిచిపోయిన బస్సు

ల్లేవని ప్రయాణికులు ఆశ్చర్యానికి లోనయ్యారు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు చేసిన తర్వాత ఆర్టీసీ సంస్థ పరిస్థితి ఇలా తయారైందని ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒక గంట తర్వాత సంస్థ ఖాతాలో డబ్బులు పడడంతో బస్సు ముందుకు కదిలింది. బస్సు కదలిక జాప్యం కావడంతో కొంతమంది ప్రయాణికులు టోల్ గేట్ వద్ద దిగిపోయి వేరే బస్సుల్లో వెళ్లి పోయారు. కొద్దినెలల క్రితం జిల్లా లోని మరో డిపో బస్సు కూడా టోల్ గేట్ వద్ద ఫీజు చెల్లించలేక నిలిచిపోయిన పరిస్థితి నెలకొంది.


# గాంధీపై విద్వేషంతోనే 'ఉపాధి' పేరు మార్పు

- ఎన్‌డిఎ నేతల దేశభక్తి ఒక కపట ప్రేమ
- ధాన్యం కొనుగోలు ప్రభుత్వమే చేపట్టాలి
- ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.కృష్ణమూర్తి, బంటు దాసు డిమాండ్

**ప్రజాశక్తి - పార్వతీపురం**

మహాత్మా గాంధీపై బిజెపికి ఉన్న విద్వేషపూరితమైన నిజస్వరూపం ఉపాధి హామీ పేరు మార్పుతో బట్టబయలైందని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.కృష్ణమూర్తి, బంటు దాసు పేర్కొన్నారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు రెడ్డి లక్ష్మునాయుడు, గేదెల సత్యనారాయణతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని మార్పు చేయడం వెనుక బిజెపి, ఎన్‌డిఎ కూటమి నేతల దేశభక్తి ప్రేమ పరాకాష్టకు చేరిందని విమర్శించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన మహాత్మా గాంధీని హత్య చేసింది ఆనాటి బిజెపి వారసులు నాథూరామ్ గాడ్సేనని, నేడు అదే గాడ్సే వారసులు మహాత్మా గాంధీ పేరును, రాజ్యాంగ సూత్రాలను, హక్కులను పూర్తిగా కనుమరుగయ్యేలా చర్యలు చేపడుతుందని, దీన్ని ప్రజలంతా ముక్తకంఠంగా వ్యతిరేకించాలని కోరారు. ఈ మార్పు చేసి చట్టంలో పాలక ప్రభుత్వం దయాదాక్ష్యాల పైనే ఆధారం తప్ప, ఎటువంటి హక్కు లేదని తెలిపారు. ఇది బిజెపి నిరంకుశానికి నిదర్శమన్నారు. ఉపాధి హామీ కొత్త చట్టంలో ఇంత తీవ్రమైన స్థాయిలో వ్యత్యాసం ఉన్నప్పటికీ మన రాష్ట్ర అధికార టిడిపి, జనసేన, ప్రతిపక్ష వైసిపిలు వ్యతిరేకించకుండా సమర్థించడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. బిజెపి నేతృత్వంలో రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజానీకానికి, కార్మికులకు, రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నా కనీసం ప్రశ్నించకుండా బిజెపికి దాసోహం కావడం అన్యాయమని వాపోయారు. కావున, ఇకనైనా మహాత్మా గాంధీ పేరుతో గల గ్రామీణ ఉపాధి హామీ పథకానికి రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టాలని, చట్టానికి మహాత్మా గాంధీ పేరుతోనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అలాగే మన్యం జిల్లాలో కొంతమంది అధికారులు ప్రైవేట్ రైసు మిల్లు యజమానితో కుమ్మక్కై రైతులను నట్టేంట ముంచే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఎంతో ఆర్భాటంగా ప్రకటనలు చేసి ఆర్‌ఎస్‌కెల ద్వారా ధాన్యం కొనుగోలు చేపట్టారని, తీర పంట దిగుబడి మొత్తం పూర్తికాగానే ప్రభుత్వం చేతులెత్తేయాడంతో, దిక్కుతోచని పరిస్థితుల్లో ప్రైవేటు మిల్లు యజమానులకు ధాన్యం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి

అందించే పరిస్థితి తప్పడం లేదని అన్నారు. లాభమే పరమావధిక భావించే ప్రైవేట్ మిల్లర్లు నాణ్యత నెపంతో రైతులను భయభ్రాంతులకు గురిచేసి అధిక ధాన్యాన్ని, తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ప్రయోగ శాస్త్రవేత్తల కమిటీ క్వింటా ధాన్యాన్ని రూ.3వేలు మద్దతు ధరగా నిర్ణయిస్తే దాన్ని మోడీ ప్రభుత్వం రూ.2367కు తగ్గిస్తూ కొనుగోలు చేపడుతుందని, దీన్ని మరింతగా తగ్గిస్తూ ప్రైవేట్ యాజమాన్యాలు కొనుగోలు చేపడుతుంటే అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం అన్యాయమని మండిపడ్డారు. ఇకనైనా ప్రభుత్వమే ధాన్యం మొత్తం కొనుగోలు చేపట్టాలని, రైతులకు మోసగిస్తున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## జిల్లా కేంద్రంలో పల్స్‌పోలియో ర్యాలీ

**ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్**

జిల్లాలో ఆదివారం జరగనున్న పల్స్‌పోలియో అవగాహన ర్యాలీలు జిల్లాలో నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి వై.విజయమోహన్, ఆర్‌బిఎస్‌కె డాక్టర్ టి.జగన్మోహన్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా కేంద్రాసుపత్రి నుంచి అవగాహన నినాదాలతో ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం పోలియో చుక్కలు తప్పిన పిల్లలకు ఈనెల 22,23 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి వేస్తామన్నారు.



ప్రత్యేక వార్డును ప్రారంభిస్తున్న వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ సంచాలకులు పద్మావతి

## మహిళా కుష్టురోగులకు ప్రత్యేక వార్డు

**ప్రజాశక్తి - బలిజిపేట**

మండలంలోని చిలకలపల్లి లెప్రసీ హాస్పిటల్‌లో కుష్టు వ్యాధిగ్రస్తుల కోసం నిర్మించిన ప్రత్యేక మహిళా వార్డును వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ కె.పద్మావతి శనివారం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా కుష్టు వ్యాధిగ్రస్తుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అవసరమైన అందరికీ ప్రభుత్వం ఉచితంగా శస్త్ర చికిత్స అందించడమే కాకుండా రూ.12 వేలు అందజేస్తుందన్నారు. వీరికి ప్రత్యేకంగా సదరం పత్రం లేకుండానే రూ.6000 పింఛను అందజేసుందన్నారు. కుష్టు వ్యాధి పట్ల అపోహలు వీడి మచ్చలు ఉన్న ప్రతి ఒక్కరూ పరీక్ష చేయించుకొని వెంటనే చికిత్స పొందాలని కోరారు. జిల్లాలో కుష్టు వ్యాధిపై జరుగుతున్న కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఫిజియోథెరపీ కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు ప్రారంభించారు. రోగులంతా ఈ సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. లెప్రసీ హాస్పిటల్ చేస్తున్న కృషిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం బలిజిపేట పిహెచ్‌సిని పద్మావతి సందర్శించారు. అన్ని రికార్డులు పరిశీలించి ఇకపై ప్రతి రికార్డ్ డిజిటలైజ్ చేయాలని ఆదేశించారు. రోగులందరికీ ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్ తప్పనిసరిగా అభా ఐడితో జనరేట్ చేసి వారి వివరాలు అందులో నమోదు చేయాలని సూచించారు. పల్స్ పోలియో కార్యక్రమం సంబంధించిన మైక్రోయాక్షన్ ప్లాన్, వ్యాక్సిన్, ఆన్లైన్ యాప్ ద్వారా నమోదు పరిశీలించారు. కార్యక్రమంలో విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లా కుష్టు వ్యాధి నియంత్రణ అధికారులు డాక్టర్ రాణి, డాక్టర్ వినోద్, డాక్టర్ శ్రీకాంత్ డిపిఎంఒ డాక్టర్ రఘు కుమార్, అంధత్వ నివారణ అధికారి డాక్టర్ కౌశిక్, బలిజిపేట పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ మాధురి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నాణ్యమైన పోషకాహారాన్ని అందించడమే ప్రధాన లక్ష్యం

### అంగన్‌వాడీలకు పోషకాహార సరఫరాపై జెసి సమీక్ష

**ప్రజాశక్తి - పార్వతీపురం**

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన పోషకాహారాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నవంబర్‌కు సంబంధించి అంగన్‌వాడీ కేంద్రాలకు వివిధ నిత్యావసర వస్తువుల సరఫరా, పంపిణీపై శనివారం కలెక్టరెట్ సమావేశ మందిరంలో ఆయన సంబంధిత శాఖల అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేసే బియ్యం, కందిపప్పు, వంట నూనె అత్యుత్తమ నాణ్యతతో ఉండాలని, ఎక్కడా నిల్వలు నిలిచిపోకుండా సకాలంలో సరఫరా చేయాలని ఏపీ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ అధికారులకు సూచించారు. అలాగే చిన్నారులకు, గర్భిణీలకు అందించే పాలు తాజాగా ఉండేలా చూడాలని, డెయిరీ ద్వారా సరఫరా ప్రక్రియలో ఎటువంటి అంతరాయం కలగకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. కేంద్రాలకు అందే కోడిగుడ్ల నాణ్యతను నిరంతరం తనిఖీ చేయాలన్నారు. అలాగే చిన్నారుల శారీరక పెరుగుదలకు అవసరమైన బాలామృతం, పోషకాహార కిట్‌ల పంపిణీని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఐసిడిఎస్ అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యే ప్రతి వస్తువు నాణ్యతను క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించాలని, ఎక్కడైనా నాణ్యత లోపించినట్లు ఫిర్యాదులు వస్తే సంబంధిత సరఫరాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జెసి హెచ్చరించారు. లబ్ధిదారులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందుతున్నదీ లేనిదీ పర్యవేక్షించాలని అధికారులకు స్పష్టం చేశారు. సమీక్షా సమావేశంలో ఐసిడిఎస్ పిఒ కనక దుర్గా, ఉప వైద్య ఆరోగ్య అధికారి, జిల్లా పౌర సరఫరా అధికారి, జిల్లా మేనేజర్ పౌర సరఫరాలు, గుడ్లు, పాలు సరఫరాదారులు, తదితరులు ఉన్నారు.

## కొత్త బ్రిడ్జిపై ట్రైల్ రన్ సక్సెస్

**ప్రజాశక్తి - సీతానగరం**

మండల కేంద్రమైన సీతానగరం వద్ద సువర్ణముఖి నదిపై రూ.12కోట్లతో కొత్తగా నిర్మించిన బ్రిడ్జి ట్రయిల్ రన్ విజయవంతమైంది. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే బి.విజయచంద్ర శనివారం ట్రయిల్ రన్ నిర్వహించారు. 2014లో అప్పటి టిడిపి ప్రభుత్వం సువర్ణముఖి నదిపై బ్రిడ్జికి శంకుస్థాపన చేసింది. గత ప్రభుత్వంలో పనులు నిలిచిపోగా, మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చాక బ్రిడ్జి పనులను ఎమ్మెల్యే పూర్తి చేయించి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు పి.సత్యం నాయుడు, ఆర్.వేణుగోపాలనాయుడు, కూటమి నాయకులు ద్వారపూడి శ్రీనివాసరావు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న జెసి యశ్వంత్‌కుమార్‌రెడ్డి



## కలెక్టరేట్ ఆవరణలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర

**ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్**

స్వర్ణాంధ్ర - స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో స్వచ్ఛతా కార్యక్రమం నిర్వహించారు. ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్‌ఒ కె.హేమలత పాల్గొని స్వయంగా శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్, అధికారులతో కలిసి కలెక్టరేట్ ప్రాంగణ మంతా కలియతిరిగి, అక్కడ పేరుకుపోయిన ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలను ఏరివేశారు. కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా, ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించాలని సిబ్బందికి పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు, స్వచ్ఛత అనంతరం కలెక్టరేట్ ఆవరణలో పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంచే ఉద్దేశంతో అధికారులు మొక్కలు నాటారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జేసీ పేర్కొన్నారు. అధికారులే వ్యర్థాలను తొలగిస్తూ మొక్కలు నాటడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

**మున్సిపల్ కార్యాలయంలో**

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే బి.విజయ్‌కుమార్ పాల్గొనఆనరు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరిది అని, 2026 స్వచ్ఛ సర్వేక్షన్ లో పార్వతీపురం పట్టణానికి మంచి ర్యాంకు సాధించాలని పట్టణ ప్రజలకు, మున్సిపల్ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. కాలువల్లో పూడికలు లేకుండా చూడాలని తడి, పొడి చెత్తను వేరు చేసి ప్రతిరోజు మీ నివాస గృహాలకు వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని సూచించారు. అనంతరం అధికారులు, సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# సిఐటియు జాతీయ మహాసభను జయప్రదం చేయాలి

**ప్రజాశక్తి - పాలకొండ**

ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.అమరవేణి పిలుపునిచ్చారు. అలాగే జనవరి 4న విశాఖ ఆర్‌కె బీచ్ వద్ద జరిగే భారీ బహిరంగ సభలో యావన్మంది కార్మిక వర్గం పాల్గొవాలని కోరారు. శనివారం స్థానిక రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులతో కలిసి మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్లకు మేలు చేసేందుకు, కార్మిక వర్గం హక్కులను హరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని, ఈ విధానాలకు వ్యతిరేకంగా బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో సిఐటియు అగ్రభాగాన నిలిచిందని తెలిపారు. రైస్ మిల్ కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని, గ్రాడ్యుటీ అమలు చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు అమలు చేయాలని, 8 గంటల పని అమలు చేయాలని, 50 కేజీలు బరువు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కాద రాము, రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కార్యదర్శి జి.సత్యం, వై.శ్రీనివాసరావు, వై.సింహాలు, జి.గణ, జి.పారినాయుడు, చల్ల స్వామినాయుడు, దాసు తదితరులు పాల్గొన్నారు.

**కొమరాడ** : విశాఖపట్నంలో జరుగు సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు



కూనేరు సంతలో ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు

ఆధ్వర్యంలో మండలంలోని కూనేరు సంతలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను కట్ట పెట్టేందుకు ప్రభుత్వ రంగాన్ని బలహీన పరుస్తుందని, ఈ విధానాలకు వ్యతిరేకంగా నికరమైన పోరాటాలు నిర్వహించేది సిఐటియు అని, అలాంటి సిఐటియు అఖిలభారత మహాసభలు మన రాష్ట్రంలో మొట్టమొదటిసారి జరుగుతున్నాయని తెలిపారు. ఈ మహాసభల జయప్రదానికి కార్మిక వర్గం, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ ర్యాలీలో ప్రజా సంఘాల నాయకులు చింతామణ, కైలాస్, రెడ్డి శివున్నాయుడు పలువురు ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# 'ముస్తాబు'తో విద్యార్థుల ఆరోగ్యంలో మార్పు

**ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్**

ముస్తాబుతో విద్యార్థుల ఆరోగ్యంలో ఘననీయమైన మార్పు వచ్చిందని జాయింట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ముస్తాబు కార్యక్రమం ప్రారంభం కానున్న సందర్భంగా పట్టణంలోని చాకలి బెలగాం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో నిర్వహిస్తున్న ముస్తాబు కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ శనివారం పర్యవేక్షించారు. కార్యక్రమంలో జెసి మాట్లాడుతూ విద్యార్థుల చదువుపైనే కాకుండా ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కోసం పాఠశాలల్లో 'ఆనందలహరి' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టామన్నారు. ఈ కార్యక్రమలో పిల్లలతో నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. ప్రార్థనలో పిల్లలతో యోగా, ఏరోబిక్స్ చేయించడం తప్పనిసరి అన్నారు. విద్యార్థులకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణంలో విద్యను అందించడమే ఈ ముస్తాబు కార్యక్రమం




పాఠశాలలో ప్రవేశపెట్టిన ముస్తాబును ప్రారంభిస్తున్న జెసి యశ్వంత్‌కుమార్‌రెడ్డి

ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అలాగే ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించాలని, అందుకు కావాల్సిన అవగాహన కల్పించాలని అన్నారు. పాఠశాలలోని తరగతి గదులు స్వయంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించి వారికి అందుతున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు ఉన్నారు.

## ప్లాస్టిక్ రహిత జిల్లాగా మారుద్దాం : జెసి

**ప్రజాశక్తి - పార్వతీపురం**

ప్లాస్టిక్ తయారీ యూనిట్లపై పరిశ్రమల శాఖ నిరంతర నిఘా ఉంచాలని, జిల్లాలో పర్యావరణ పరిరక్షణకు విఘాతం కలిగిస్తున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించాలని జెసి అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో మున్సిపల్, పరిశ్రమలు, కాలుష్య నియంత్రణ ఇతర శాఖల అధికారులతో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ మార్కెట్లు, దుకాణాలు, వారపు సంతల్లో ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ వినియోగం అధికంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల డ్రైనేజీలు పూడికుపోవడమే కాకుండా పర్యావరణం దెబ్బతింటోందని పేర్కొన్నారు. మున్సిపల్, లీగల్ మెట్రాలజీ, కాలుష్య నియంత్రణ, కార్మిక శాఖ అధికారులు సమన్వయంతో జిల్లా వ్యాప్తంగా ఉమ్మడి తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై భారీ జరిమానాలు విధించాలని ఆదేశించారు. ప్లాస్టిక్ తయారీ యూనిట్లపై పరిశ్రమల శాఖ నిరంతర నిఘా ఉంచాలని, అదే సమయంలో ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా బట్ట సంచులు, పేపర్ బ్యాగుల వాడకాన్ని ప్రోత్సహించాలని సూచించారు. పర్యావరణహిత సంచుల తయారీలో స్థానిక స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహించి, వారికి ఉపాధి కల్పించాలని నిర్ణయించారు. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై వ్యాపారులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను కోరారు. సమావేశంలో పార్వతీపురం, సాలూరు మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పరిశ్రమల అధికారి, లీగల్ మెట్రాలజీ, కాలుష్య నియంత్రణ, కార్మిక శాఖ అధికారులు ఉన్నారు.

## గిరిజనులపై అటవీశాఖ అధికారుల తీరు మారాలి

**ప్రజాశక్తి - కొమరాడ**

గిరిజనులపై అటవీ శాఖ అధికారుల తీరు మారాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. అటవీ శాఖ అధికారుల తీరుకు వ్యతిరేకంగా కూనేరు సంతలో సిపిఎం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ నేటికీ అనేక గిరిజన గ్రామాలకు విద్యుత్తు లేని పరిస్థితి ఉందన్నారు. మండలంలో కూనేరు నుంచి మసిమండ మీదగా ఎండబద్ర, పూడేసు మీదుగా లంజి, కుంతేసు వరకు రహదారి మార్గాన విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు అధికారులు స్తంభాలు వేస్తుండగా అటవీశాఖాధికారులు ఆ స్థలం తమది అంటూ స్తంభాలు వేయడానికి వీల్లేదని అడ్డుకోవడం అన్యాయమని అన్నారు. కావున వెంటనే అటవీశాఖ అధికారులు ఏదైతే విద్యుత్ స్తంభాలను నిలిపివేశారో ఈ విషయాన్ని వెనక్కి తీసుకొని అన్ని గిరిజన గ్రామాలకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేసేందుకు అటవీశాఖ అధికారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు చింతామణి, కైలాస్, త్రినాథ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివున్నాయుడు, గిరిజన యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## శాంతి, కరుణకు ప్రతీక క్రిస్మస్ : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి- గుమ్మలక్ష్మీపురం**

క్రిస్మస్ పండ శాంతి, ప్రేమ, కరుణ, త్యాగం వంటి మానవీయ విలువలకు ప్రతీక అని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రాంగణంలో శనివారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆమె పాల్గొని దైవ సేవకులతో కలిసి కేక్ కట్ చేసి విశ్వాసులకు సెమీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌టి కమిషన్ సభ్యులు కడ్రక మల్లేశ్వరరావు, రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ సేనాపతి శేఖర్ పాత్రుడు, రాష్ట్ర కార్యదర్శి బిడ్డిక పద్మావతి, మాజీ సమితి అధ్యక్షులు వెంపటాపు భారతి, మాజీ ఎంపిటిసి సునీత, మహిళా గ్రామైక్య సంఘ జిల్లా కార్యదర్శి సుబ్బలక్ష్మీ, ఎఎంసి చైర్మన్ గౌరీ శంకర్, జనసేన మండల కన్వీనర్ శ్రీకర్, అప్పలకొండ, అనంత్, రామారావు తదితరులు పాల్గొన్నారు.



క్రిస్మస్ కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

# గడగమ్మలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కిమ్మి సచివాలయం పరిధిలో గల గడగమ్మలో శనివారం స్థానిక వైద్యాధికారి ఎం.సాయి కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, గర్భిణీలు, బాలింతలు, మధు మేహ, రక్తపోటు, తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్యతనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్, ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ ఎం, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

# ఆక్సిజన్ కాన్సెండెంటర్లు అందజేత

ప్రజాశక్తి - పాలకొండ

న్యూ హోప్ ఫౌండేషన్ ప్రతినిధి పాస్టర్ బెన్‌హర్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఏరియా ఆసుపత్రికి రెండు ఆక్సిజన్ కాన్సెండెంటర్లు అందజేశారు. ఆలాగే ఎయిడ్స్‌తో బాధపడపడుతున్న సుమారుగా 50మంది పిల్లలకు రెండు నెలలకు సరిపడ్డ ఆహార పదార్థాలు అందజేశారు. ముఖ్య అతిథిగా ఏరియా సూపరింటెండెంట్ కె.చిరంజీవికి అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ జె.రవీంద్ర, చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ సాకేత్, ఆసుపత్రి ఎఒ, ఎయిడ్స్ విభాగం కౌన్సిలర్ శ్రీహరి నాయుడు, బాలా నాగమ్మ, అరుణ, గోవింద్, హోప్ ఫౌండేషన్ ఆర్గనైజర్ అనిల్ కుమార్, తులసమ్మ పాల్గొన్నారు.

# జనవాణికి వినతుల వెల్లువ

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తన కార్యాలయంలో శనివారం నిర్వహించిన జనవాణి కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలో గల నాలుగు మండలాల నుంచి అనేకమంది పలు సమస్యలు పరిష్కారం కోరుతూ వినతులు అందించారు. వీటిని పాలకొండ జనసేన నాయకులు కొండదడి రాజేష్, ఎం.ప్రసాదు, వీరఘట్టం నాయకులు నాగేశ్వరరావు తదితరులు స్వీకరించారు. వీటిని ఎమ్మెల్యే దష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

# పల్లా ప్రతాప్‌కు పలువురి నివాళి

**పాలకొండ:** స్థానిక నగర పంచాయతీ వైస్ చైర్మన్ పల్లా ప్రతాప్ అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహానికి పలువురు నాయకులు వచ్చి నివాళ్లు అర్పించారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవి, పట్టణ అధ్యక్షులు గంట సంతోష్ కుమార్, పట్టణ వైసిపి అధ్యక్షులు వెలమల మన్మధరావు తదితరులు నివాళులు అర్పించారు. ఆయన సోదరుడు నగర పంచాయతీ సమన్వయకర్త పలా కొండలరావు పరామర్శించారు

# ఆశ్రమ పాఠశాలను సందర్శించిన డిడి

**సీతంపేట:** స్థానిక గిరిజన సంక్షేమ బాలుర, బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలను గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.అన్నదొర శనివారం సందర్శించారు. ముస్తాబు కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. అనంతరం హడ్డుబంగి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం అడిగి తెలుసుకున్నారు. డిడితో పాటు డిప్యూటీ డిఇఒ జి.రామ్మోహన్‌రావు, హెచ్‌ఎం టి.చంద్రరావు, వసంతలక్ష్మి, ఉమావాణి, హెచ్‌డబ్ల్యుఒ పాలక అమల, డిప్యూటీ వార్డెన్లు బి.గాసయ్య, బి.నీలవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బక్కుపేట పాఠశాలలో 'ముస్తాబు'

**సీతానగరం:** మండలంలోని బొక్కుపేట ప్రాథమిక పాఠశాలలో శనివారం ముస్తాబు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కె.కృష్ణదాస్ మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో ఆసక్తిగా శుభ్రం చేసుకుని పాఠశాలకు కొత్త దుస్తులు వేసుకొని పాఠశాలను అలంకరిస్తే అందంగా ఉంటుందన్నారు. అంతేకాదు విద్యార్థులు శుభ్రత పాటించడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. శుభ్రత ఉంటే అన్ని విషయాల్లో అవగాహన కలుగు తుందన్నారు. విద్యార్థులు విద్యతో పాటు ఆరోగ్యం ఉండడం ఎంతో అవసర మన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గౌరీశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు

# స్నేహ కళా సాహితీ అభివృద్ధికి కృషి

**కురుపాం:** స్నేహ కళా సాహితీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని కళా సాహితి సభ్యులు, మాజీ జడ్పీటీసీ అంధవరపు కోటేశ్వరరావు అన్నారు. శనివారం నిర్వహించిన స్నేహ కళా సాహితీ సభ్యుల ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇకపై సాహితీ సమావేశాలు విరివిగా నిర్వహించి కళా సాహిత్యాన్ని మరింత ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా సంఘ కార్యకలాపాల కోసం 30 కుర్చీలు, భవనానికి అవసరమైన ఫ్యాన్లు, విద్యుత్ సామాగ్రిని విరాళంగా అందించారు. అలాగే కురుపాం ఉపసర్పంచ్ షేక్ ఆదిల్ భవనానికి అవసరమైన పెయింటింగ్ పనులను విరాళంగా చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గోవింద కృష్ణారావు, జామి దేదీప్రసాద్, జగదీశ్వరరావు, బిఎల్ ప్రకాష్, జి.వెంకటరావు, జి.నీలకంఠం పాల్గొన్నారు.

# క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఎంపికలు

**సీతంపేట:** జిల్లాలో క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఈ నెల 22,23 తేదీల్లో పాలకొండ నియోజకవర్గంలో ఐటిడిఎ పిఒ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ ఆదేశాల మేరకు ఎంపికలు నిర్వహిస్తామని డిడి అన్నదొర, స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి జాకబ్ దయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐటిడిఎ పరిధిలో ఉన్న ఆసక్తి గల విద్యార్థులు ఎంపికలో పాల్గొనాలని కోరారు. జిల్లా స్థాయి ఎంపికలు పార్వతీపురంలో ఈ నెల 29న నిర్వహిస్తారని తెలిపారు.

# 'విబి జి రామ్ జి' బిల్లు ప్రతులు దహనం

**సీతంపేట:** మహాత్మగాంధీ ఉపాధి హామీ చట్టం స్థానంలో మోడీ ప్రభుత్వం తెచ్చిన జిరామ్‌జి బిల్లు కాపీలను మండలంలోని నెల్లిగండిలో సిపిఎం ఆధ్వర్యంలో శనివారం దహనం చేశారు. మోడీ ప్రభుత్వం కుట్రను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం పార్లమెంట్‌లో బిల్లులు రద్దు చేయాలని, పాత బిల్లులు కొనసాగించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.తిరుపతిరావు, పి. కుమార్, పి.వీరన్న, ఎం. వెంకటేష్, ఎం. కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి కృషి చేయాలి : ఎమ్మెల్యే

**గుమ్మలక్ష్మీపురం:** పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం టిడిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడతూ గ్రామాలాభివృద్ధి, పార్టీ బలోపేతం, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతి ఇంటికీ చేరవేయడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. స్థానిక ఎన్నికల్లో శతశాతం కూటమి అభ్యర్థులనే గెలిపించే విధంగా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

# గణిత ప్రతిభా పరీక్షకు స్పందన

**సాలూరు:** స్థానిక రామానుజన్ మేథ్స్ క్లబ్ ఆధ్వర్యాన శనివారం శ్రీ సత్యసాయి జూనియర్ కళాశాలలో నిర్వహించిన గణిత ప్రతిభా పరీక్షకు అనూహ్యస్పందన లభించింది. క్లబ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ రంభ రజనీకాంత్ ఏటా పదో తరగతి విద్యార్థులకు ఈ ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షకు నియోజకవర్గంలోని 24 ఉన్నత పాఠశాల నుంచి 389మంది విద్యార్థులు హాజరయ్యారు. విజేతలకు ఈనెల 22న రామానుజన్‌జయంతి సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నారు. ప్రతి పాఠశాల నుంచి మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నారు. ఈ పరీక్ష నిర్వహణలో క్లబ్ సభ్యులు కె.గిరిబాబు, విహెచ్ ప్రసాద్, సంతోష్, రాజేష్, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# దుప్పట్లు, పుస్తకాలు వితరణ

**కొమరాడ :** మండలంలోని పాలెం పంచాయతీ కర్లగండలో 31 కుటుంబాలకు దుప్పట్లు, పిల్లలకు నోట్ బుక్స్ పంపిణీ చేసినట్లు విశ్రాంత బ్యాంక్ మేనేజర్ కొత్తకోట మల్లికార్జున్ అన్నారు. శుక్రవారం పాలెంలో దాతల సహకారం ఎస్ సొసైటీ ఆధ్వర్యంలో దుప్పట్లు, పుస్తకాలు అందజేసి ప్రజలకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కురుపాంకు చెందిన మల్లికార్జున్ మాట్లాడుతూ సమాజంలో ఆర్థికంగా ఎంతో కొంత వృద్ధి చెందిన వారు పేదరిక నిర్మూలనకు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా విద్య ద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందని, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్‌గౌస్ మాట్లాడుతూ దాతల సహకారంతో ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహేష్, కూటమి నాయకులు విద్య సాగర్, సన్యాసి రావు, గ్రామ పెద్దలు నీలయ్య తదితరులు పాల్గొన్నారు.

# పురుగుల మందు తాగి యువకుడు మృతి

**కంటోన్మెంట్:** నగరంలోని సీతం కళాశాల సమీపంలో పంట పొలాల్లో కొండకరకానికి చెందిన పి. నారాయణరావు(26) పురుగు మందు తాగి గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లితో పాటు పొలం పనులు చేయడానికి వచ్చిన యువకుడు వాంతులు చేసుకోవడాన్ని గమనించి తల్లి వెంటనే జిల్లా కేంద్రాస్పత్రికి తరలించింది. పరిస్థితి విషమించి శుక్రవారం అర్ధరాత్రి చనిపోయాడు. ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

# ఆటో వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలో ఆటోరంగంపై ఆధారపడి జీవిస్తున్న డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం కృషి చేయాలని ఆటో వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సాలూరు పట్టణంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు పువ్వల సోమేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలు ఆలోచన మంచిదే అయినా ఉచిత మహిళల బస్సు పథకం వల్ల ఆటోరంగంపై ఆధారపడ్డ కార్మికుల జీవితాలు చిన్నభిన్నాం అయ్యాయని, మన్యం, శ్రీకాకుళం, విజయనగరం వంటి జిల్లాల్లో ఫ్యాక్టరీలు, పరిశ్రమలు లేని ప్రాంతాల్లో ఆటో రంగమే జీవనోపాధి కల్పిస్తుందని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో మూతపడ్డ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

పరిశ్రమలైన లచ్చయ్యపేట, భీమసింగి సుగర్ ఫ్యాక్టరీలు, జిగిరాం, బొబ్బిలి జూట్ మిల్లు, పభుత్వ విధానాల వల్ల తెరవకపోవడం వాటిపై ఆధారపడ్డ కార్మికులు కూడా ఆటోరంగంలోకి రావడం వల్ల అందరికీ ఉపాధినిచ్చే రంగంగా ఆటో మోటార్ రంగం తయారైందన్నారు. మహిళలు ఉచిత బస్సులు వైపు వెళ్లడం వల్ల ఆటో కార్మికులకు ఉపాధి లేకుండా ప్రభుత్వమే చేసిందని విమర్శించారు. వీటికి తోడు ఆటో డ్రైవర్లకు ఉరితాడులా ఉండే జిఒ 21ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆటో రంగ కార్మికులకు వడ్డీ లేని రుణాలు బ్యాంకుల ద్వారా ఇప్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఈనెల 31, జనవరి 4 తేదీల్లో విశాఖలో జరుగు సిఐటియు అఖిలభారత మహాసభల్లో ఆటోమోటార్ కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు కమిటీ సభ్యులు కే శ్రీను ,కే తవుడు, టీ జగదీశ్వరరావు, నరసింహారావు, వాసు తదితరులు పాల్గొన్నారు.

# వైసిపి నుంచి జనసేనలోకి చేరికలు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో తిత్తిరి పంచాయతీ బల్లెరుగూడలో మాజీ సర్పంచ్ బిడ్డిక అడ్డాయితో పాటు పలు కుటుంబాలు శనివారం కురుపాం మండల జనసేన పార్టీ అధ్యక్షులు నేరేడుబెల్లి వంశీ ఆధ్వర్యంలో చేరారు. వీరికి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలు పరిపాలన నచ్చి జనసేనలో చేరామని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు అధికారి అనిల్, గండిమాని అజయ్ కుమార్, బిడ్డిక సురేష్, కె. కామేశ్వరరావు, పత్తికి మాధవ రాంబాబు, నూకరాజు వెంకట్రావు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జిల్లా కేంద్రంలో డివిఎంఎంహెచ్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారు. బయో పల్స్ సాగు విధానంపై రూపొందించిన వినూత్న నమూనాతో న్యాయనిర్ణేతలను ఆకట్టుకుని మొదటి బహుమతి సాధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి విజేతలైన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. బయో పల్స్ డ్రిప్ సాగు విధానం విద్యుత్తు, సెన్సార్లు అవసరం లేకుండా పనిచేసే ఆధునిక సాగునీటి విధానమని, ఇది రైతులకు తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం చేకూర్చే సాంకేతికతగా ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే అన్నారు. సైన్స్ గైడ్ ఉపాధ్యాయురాలు కే. అంబిక మార్గదర్శకత్వంలో విద్యార్థులు ఎస్.ప్రణవశ్రీ, పి.చందన ఈ నమూనాను రూపొందించారు. జిల్లా స్థాయిలో సాధించిన విజయాన్ని రాష్ట్ర స్థాయిలోనూ పునరావృతం చేసి జిల్లాకు, నియోజకవర్గానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే విద్యార్థులకు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడంతో పాటు వ్యవసాయ రంగంలో వినూత్న ఆలోచనలకు ప్రోత్సాహం ఇస్తోందని పలువురు ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 భీముడు, ఎస్‌ఎంసి చైర్మన్ సొంటేనా రాజేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

ప్రజాశక్తి - కొమరాడ

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి మన్యం జిల్లా రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి దామోదరరావు సూచించారు. శనివారం స్థానిక కెజిబివి విద్యాల యంలో బాల్యవివాహాల నిర్మూలనకు బాల్య వివాహ ముక్తభారత్ కార్యక్ర మం చేపట్టి న్యాయ విషయాలపై పిల్లలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ బాల్య వివాహాల వల్ల బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం అభివృద్ధికి ఆటంకమే కాకుండా వారి కలలను సాకారం చేసుకొనే అవకాశాలను దూరం చేస్తుం దన్నారు. ఏ గ్రామంలోనైనా బాల్యవి వాహాలు జరిగినట్లయితే సంబంధిత అధికారులకు, పోలీసులకు సమా చారం ఇచ్చి వాటిని అడ్డుకునేందుకు ప్రజలంతా ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై కె.నీల కంఠం మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న కొత్త చట్టాలపై అవగాహన, సమా జంలో మహిళలు, చిన్న పిల్లల పట్ల జరుగుతున్న నేరాలను, ఆన్లైన్ మోసా లను, గంజాయి వంటి మాదకద్రవ్యాల పట్ల అవగాహన కల్పిస్తా మన్నారు. కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ జోగారావు, ఎ టు జె ప్రాజెక్ట్ అప్ హెల్ప్ స్వచ్ఛంద సేవా సంస్థ, కెజిబివి ప్రత్యేక అధికారి జి.అరుణ, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఆర్థిక స్వావలంబన పొందాలి

ప్రజాశక్తి - పాచిపెంట

మహిళలు స్వశక్తితో ఎదిగి ఆర్థిక స్వావలంబన పొందడం కోసమే మహిళలకు కుటీర పరిశ్రమల స్థాపనకు ఉచిత శిక్షణ ఇస్తున్నామని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఉమా జ్యోతి అన్నారు. మండలంలోని అమ్మవలసలో మహిళా రైతులకు నల్ల బియ్యం పాయసం తయారీని వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 15 నుండి 20 మంది మహిళలు ఒక గ్రూపుగా ఏర్పడితే బిస్కెట్లు, పచ్చళ్లు, సలాడ్లు వంటి తయారీపై శిక్షణ ఇస్తామన్నారు. మహిళలు కొంతమంది ఇతర రాష్ట్రాలకు వెళ్లి డబ్బులు వెచ్చించి శిక్షణ పొందుతున్నారని, కృషి విజ్ఞాన కేంద్రంలో ఎలాంటి రుసుం లేకుండా ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని, మహిళా రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిన్న చిన్న కుటీర పరిశ్రమలు స్థాపించుకున్నట్లయితే ఆర్థికంగా ఎదగడమే కాకుండా మరి కొంతమందికి ఉపాధి కల్పించినట్లవుతుందన్నారు. కావున తప్పనిసరిగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కె.తిరుపతి రావు పాల్గొన్నారు

# 'నా ఇంటి స్థలం దౌర్జన్యంగా లాక్కొన్నారు'

ప్రజాశక్తి - మక్కువ

తాను నిరుపేదనని, తనకు వెనకా ముందు ఎవరూ లేరన్నది చూసుకొని గత ప్రభుత్వంలో ఇచ్చిన ఇంటి స్థలాన్ని దౌర్జన్యంగా తీసుకొని, తనను బెదిరించి పునాదులను తవ్వి వేరే వారు పునాదులు వేసుకున్నారని మండలంలోని చెముడు గ్రామానికి చెందిన బొద్దూరు కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. వడ్రంగి వృత్తిని జీవనాధారం చేసుకొని బతికే తనకు 2024లో అప్పటి తహశీల్దార్ ఎ.సూర్యనారాయణ సర్వేనెంబర్ 84 /11లో ఇంటి పట్టా మంజూరు చేశారని తెలిపారు. ఇటీవల తన భార్య మరణించడంతో డబ్బుల్లేక ఇల్లు కట్టుకోలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని ఆసరాగా తీసుకున్న స్థానిక టిడిపి నాయకుడు గొంగాడు భూషణరావు నాయకత్వంలో తన స్థలాన్ని కబ్జా చేసి వేరొకరు పునాదులు కట్టించారని కృష్ణ వాపోయాడు. ఈ విషయమై స్థానిక పెద్దల దృష్టిలో పెట్టినప్పటికీ ప్రయోజనం లేకపోయిందన్నాడు. ఈనెల 15న జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు కూడా చేశానని ఆయన తెలిపాడు. తాను ఇల్లు లేక వేరొకరి స్థలంలో ఉంటున్నానని తెలిపారు. తనలాగే చాలామంది ఇంటి పట్టాలు తీసుకుని ఇల్లు కట్టుకోలేని వారు ఉన్నప్పటికీ, నిరుపేదైనని, తన స్థలాన్ని దౌర్జన్యం చేసి పునాదులు వేసుకున్నారని బాధితులు రోధిస్తున్నాడు. ఒంటరిగా జీవిస్తున్న తనను అధికారులు ఆదుకోవాలని ఆయన కోరుతున్నారు. ఇదే అంశంపై ఆరోపణలు ఎదుర్కొంటున్న స్థానిక టిడిపి నేత జి.భూషణరావును వివరణ కోరగా కృష్ణ ఇంటి పట్టా రద్దయిందని, దాని స్థానంలో వేరే వారు పునాది కట్టుకొని మూడు నెలలైందని తెలిపారు. అతనికి వేరేచోట పొజిషన్ పట్టా చేయిస్తూ ఇల్లు మంజూరు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని ఆయన అన్నారు.

# ఉచిత ప్రథమ చికిత్స కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో శ్రీ విజయ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత ఫస్ట్ ఎయిడ్ బాక్సులను శనివారం పంపిణీ చేశారు ఆర్టీసీ డిపో మేనేజర్ పట్నాల వెంకటేశ్వరరావు, సిఎంఇ కె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ బి.రమేష్, బిఎస్ఎన్ మూర్తి సమక్షంలో శ్రీ విజయ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ దూబ పద్మావతి, ఆరోగ్యశ్రీ మేనేజర్ రాంబాబు ఆర్టీసీ డిపోకు సంబంధించి 100 బస్సులు ఫస్ట్ ఎయిడ్ బాక్సులను డ్రైవర్లు, కండక్టర్లకు అందజేశారు. కార్యక్రమంలో దూబ పద్మావతి మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులో ప్రయాణకులు ప్రయాణించడం ఎంత సురక్షితమో అలాగే ప్రయాణం మధ్యలో ఏమైనా అనారోగ్య





ప్రథమ చికిత్స బాక్సులను అందిస్తున్న ఎమ్‌డి

సమస్యలు వస్తే వారికి మొదట ప్రాధాన్యత చికిత్స అందించడం వల్ల కొంత మేలు జరుగుతుందన్నారు. ఈ ఆలోచనతో తాము ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. అలాగే పేద, మధ్యతరగతి ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా శ్రీ విజయ ఆసుపత్రి ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. గిరిజన మారుమూల ప్రాంతాల్లోనూ, పలు గ్రామాల్లో ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామని, ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.సిఎంఇ శ్రీనివాసరావు మాట్లాడుతూ బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఎంతో ఉపయోగపడతాయని, శ్రీ విజయ హాస్పిటల్ ఎండి దూబ పద్మావతి ఇటువంటి మహోన్నత కార్యక్రమం చేపట్టడాన్ని అభినందించారు. అలాగే ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో మెడికల్ క్యాంపు నిర్వహించి బిపి, షుగర్ టెస్టు చేసి ఎటువంటి సమస్యలున్నా ఉచితంగా మందులు పంపిణీ చేయడం సంతోషించ దగ్గర విషయం అన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు సిబ్బంది, శ్రీ విజయ హాస్పిటల్ వైద్యులు పాల్గొన్నారు.

# గ్రామాల స్వయం వనరుల సేకరణపై శిక్షణ

ప్రజాశక్తి - సీతానగరం

గ్రామాల్లో గ్రామాలభివృద్ధికి స్వయంవనరులను సేకరించాలని డిడిఒ రమేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఒఎస్ఆర్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉండే ఇళ్లు, ఖాళీ స్థలాలకు సర్వే నిర్వహించి వాటికి హక్కు పత్రాలు ఇస్తామన్నారు. దీంతో ఇంటి యజమానికి బ్యాంకు రుణాలు గాని మిగతా ప్రభుత్వ పథకాలు గాని గుర్తిస్తాయి. దాని ద్వారా వారు పన్నుల రూపం ద్వారా పంచాయతీకి ఆదాయం వస్తుందని తెలిపారు. ఈ సర్వేలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు ఇంటింటా సర్వే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్, డిప్యూటీ ఎంపిడిఒ ఎం.శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, విఆర్‌ఒలు, సర్వేర్లు శిక్షణలో పాల్గొన్నారు.

**గరుగుబిల్లి:** స్వమిత్వ ద్వారా ప్రజల ఆస్తులకు శాశ్వత హక్కులు కల్పిస్తామని ఎంపిడిఒ జి.పైడితల్లి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల



సీతానగరం: సమావేశంలో మాట్లాడుతున్న డిడిఒ

పరిధిలోని ప్రజల ఆస్తులకు శాశ్వత హక్కులు కల్పించేందుకు స్వమిత్వపై గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీల పరిధిలో ఎప్పటి నుంచో ఇళ్లు ఉన్నప్పటికీ అధిక శాతం మందికి ఆ ఇళ్లపై ఎటువంటి దస్తావేజులు లేవన్నారు. ఈమేరకు స్వమిత్వపై గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, గ్రామ రెవెన్యూ అధికారులు, విలేజ్ సర్వేయర్లు సర్వే నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ ఎల్.గోపాలరావు, గ్రామపంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

**వీరఘట్టం:** పంచాయతీల్లో పనులను గుర్తించి అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ సిబ్బందిని ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ముందుగా గ్రామాల్లో పర్యటించి అభివృద్ధి చేయవలసిన పనులు గుర్తించాలన్నారు. ఆ దిశగా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ డి.వెంకటరమణ డిప్యూటీ ఎంపిడిఒలు సిహెచ్ శంకర్రావు, శాంతారావు, ఇఒ వై.గిరి, పంచాయతీల కార్యదర్శులు, ఇంజనీరింగ్ సహాయకులు, గ్రామ సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు, డిజిటల్ సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో అవగాహన ర్యాలీ

**బలిజిపేట:** మండలంలోని గలవిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్యాధికారులు డాక్టర్ రేవతి, డాక్టర్ రిషికుమార్ ఆధ్వర్యంలో నారంనాయుడువలస, గంగాడ గ్రామాలలో పల్స్ పోలియో కార్యక్రమంపై విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ సున్నా నుంచి ఐదు సంవత్సరాల వయసుగల ప్రతి ఒక్కరికీ పల్స్ పోలియో చుక్కల మందు తప్పక వేయించాలన్నారు. ఆయా గ్రామాలలో ఆదివారం నిర్దేశించిన ప్రాంతాల్లో పోలియో కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం పోలియో చుక్కలు వేయించుకొని పిల్లలకు సోమ, మంగళ వారాలలో ఇంటింటికీ తిరిగి చుక్కల మందు వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒ నరసింహులు, హెచ్ఎస్ వెంకట రమణ, హెచ్‌వి చిన్నతల్లి, ఉపాధ్యా యులు, విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు విద్యార్థులు

**గుమ్మలక్ష్మీపురం:** స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సొంటిన ప్రణవి, పిన్నింటి చందన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులకు ప్రతిభకు గుర్తించిన అధికారులు రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. వీరు ఎంపిక కావడం పట్ల ఎంఇఒలు చంద్రశేఖర్, భీముడు, ఉపాధ్యాయులు అభినందించారు.

# పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఎల్విన్ పేట కూడలిలో ఎంపిడిఒ ఐవి లక్ష్మి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. మనం నివసించే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని, చేతులు ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలని ఎమ్మె ల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కడ్రక కళావతి, మండల అధ్యక్షులు అడ్డాకుల నరేష్, రాష్ట్ర కార్యదర్శి బిడ్డిక పద్మావతి, నియోజకవర్గ మహిళా కార్యదర్శి వెంపటాపు భారతి, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు మండంగి భూషణరావు, తోటపల్లి దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులు ఆరిక జానకి, బిజెపి మండల కన్వీనర్ కడ్రక అప్పల స్వామి, తహశీల్దార్ శేఖరం, నాయకులు రామారావు, చిన్న, రాజేష్, రాజు, దొరబాబు, ప్రసాద్, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

**సీతంపేట:** సీతంపేట ఐటిడిఎలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాలు పరిశుభ్రం చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎంత ఆరోగ్యంగా ఉండొచ్చని ఇఇ రమాదేవి, డిడి అన్నదొర అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ రామ్మోహన్‌రావు, ఎఒ సునీల్, స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి జాకప్ దయానంద్, ఎస్‌ఐ వై అమ్మనరావు, హెచ్‌ఒ జయశ్రీ తదితరులు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు.

**కురుపాం :** స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ఎంపిడిఒ జె. ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం నుంచి రావాడ జంక్షన్ వరకు విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం అక్కడ మానవహారం ఏర్పాటు చేసి, స్వర్ణాంధ్ర కార్యక్రమం అవసరం, లక్ష్యాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఎంఇఒ ఎన్. సత్యనారాయణ విద్యార్థులకు ముస్తాబు కార్యక్రమం ఆవశ్యకతను వివరించి ప్రతి ఒక్కరూ శుభ్రత, క్రమశిక్షణను తప్పనిసరిగా పాటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రమేష్ బాబు, ఎంఇఒ ఎన్.సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి వై. వెంకట నాయుడు, ప్రధానోపాధ్యాయులు టి. శంకరరావు, వెలుగు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

**స్వచ్ఛ సాలూరుకు సహకరించండి : కమిషనర్**

**సాలూరు:** పట్టణ పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రతకు పట్టణ



గుమ్మలక్ష్మీపురం: రోడ్డును ఊడ్చుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి, తదితరులు

ప్రజలంతా సహకరించాలని మున్సిపల్ కమిషనర్ టిటీ రత్నకుమార్ ఆకాంక్షించారు. పట్టణంలోని మూడో 3,24 వార్డుల్లో గల పెద్ద మార్కెట్లో స్వర్ణాంధ్ర -స్వచ్ఛంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించి వారికి వ్యక్తిగత పరిశోధన, పారిశుధ్య ప్రాధాన్యతను వివరించే బాధ్యత మున్సిపల్ సిబ్బంది తీసుకోవాలని ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌ను వాడకుండా గుడ్డసంచులను వాడాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్.బాలకృష్ణ, వార్డు సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు



# విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథం పెంపొందించాలి

ప్రజాశక్తి - కురుపాం

విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కుమారస్వామి అన్నారు. కురుపాం పంచాయతీ సీతంపేటలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం.రమేష్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దడం, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలు, బహిరంగ మలవిసర్జన దుష్ప్రభావాలు, పంటలకు అధిక మోతాదులో పురుగుమందులు వాడటం వల్ల వచ్చే ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. గ్రామాల్లో చైతన్యం తీసుకురావడంలో జాతీయ సేవా పథకం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కుమారస్వామి

ప్రత్యేక సేవా శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల హెచ్‌ఎం శాంతి, కళాశాల అధ్యాపకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.